# గల్ఫ్ దేశములో నేటి తెలుగు క్రైస్తవుల స్థితి

ఆంధ్రప్రదేశ్ నుండి కుటుంబ పోషణ నిమిత్తం గల్ఫ్ దేశములకు వెళ్ళి అక్కడ జీవనం సాగిస్తున్న వారిలో అనేకమంది వారి స్థితిని మరచిపోయి వారికి ఆ స్థానమునందించిన పరమతండ్రిని, వారిపై ఆధారపడియున్న వారి యొక్క కుటుంబములను నిర్లక్ష్యం చేస్తూ వ్యసనాక్రాంతులై, అక్రమ సంబంధాలకు లొంగిపోయి వారియొక్క విశ్వాస జీవితములు కోల్పోవుచున్నారు. ఇక్కడ అధిక స్వాతంత్ర్యం వలన, ఎవరి భయం లేకపోవుటవలన, అనేకమైన అవసరతలను తీర్చేవి అందుబాటులో ఉండుటవలన అక్రమమార్గములోనే సాగిపోతున్నారు. ఇది పరమతండ్రి మార్గమునకును పరమతండ్రి దృష్టికి చాలా అసహ్యమైన ప్రవర్తన గనుక పరమతండ్రి పిలుస్తున్నాడు మొదటి విశ్వాసమునుండి పడిపోయినవారిని, పరమతండ్రికి నమ్మకస్తులై ఉండి ఇప్పుడు ఆ స్థానమును పోగొట్టుకున్నవారిని పిలుస్తున్నాడు. "భ్రష్టులైన బిడ్డలారా! తిరిగి రండి, మీ అవిశ్వాసమును నేను బాగుచేసెదను. యిర్మీయా 3:22. ఒక్కసారి ఆలోచించండి ఆయన యొక్క కాపుదల లేక నరులు ఏమైపోవుదురు – తన శ్వాసనిశ్వాసములను తన యొద్దకు తిరిగి తీసుకొనినయెడల శరీరులందరూ ఏకముగా నశించెదరు, నరులు మరలా ధూళియైపోవుదురు యోబు34:14. ఆయనకు వ్యతిరేకమైన పనులు ఎన్నో చేస్తున్నను ఆయన ఎందుకు సహించుకొనుచున్నాడో ఆలోచించండి. మీరు మారుమనస్సు పొంది తిరిగి ఆయన యొద్దకు వచ్చి స్థిరముగా ఉండి ఆయన నామము ఘనపరచుటకై ఆయన ఎదురుచూస్తున్నాడు.

-మనుష్యులు పడి తిరిగి లేవకుందురా? తొలగిపోయిన తరువాత మనుష్యులు తిరిగి రారా? (యిర్మీయా 8:4) అని పరమతండ్రి పడిపోయిన వారిని గూర్చియు, విశ్వాసమార్గము నుండి తొలగిపోయినవారిని గూర్చియు చింతిస్తున్నాడు. పరాయి దేశంలో మీరు నిగ్రహ విషయంలో యోసేపు వంటి వారై యుండాలి. యోసేపును మనం మాదిరిగా తీసుకోవాలనే మనకు వాక్యములో అతని నిగ్రహమును గూర్చి వ్రాయబడినది. అందుకే అతడు అత్యున్నతమైన స్థానమును పొందుకున్నాడు. "కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి ఎలోహీంకి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను ఆది 39:9. యోసేపు నీతి అది. కాని నేడు మీరు ఇక్కడ అవకాశములను వెతుకుకొనుచూ ఫోన్లు చేసి విశ్వాసులను మరలుకొల్పుచూ పరమతండ్రికి విరోధమైన పాపమును (జారత్వము/వ్యభిచారము) చేయుచున్నారు. మీకు ఇక్కడ ఈ విధానము సరియైనది కాదు అది పరమతండ్రికి పూర్తి వ్యతిరేఖమైనది దీనిని విడనాడండి అని చెప్పేవారు లేరు. మీరు ప్రతి శుక్రవారం కూడుకొనుట ఈ పాస్టర్ల లాభాలకే గాని మీకు మేలుకలుగుటట్లు మీకు బోధించుటకు కాదు. ఇక్కడ క్రైస్తవ్యమంటే వ్యాపారమే ప్రతీ సంవత్సరం ఒక్కొక్క క్రొత్త బోధకుని రప్పించుకొనుచున్నారు. అతడు వచ్చి మిమ్ములను పొగిడి మీ తప్పులను సరిచేయకుండా మీ పాపములను కప్పి మీ సొమ్మును దోచుకొనుచున్నాడు. ఏ బోధకుడు వచ్చినా ఇదే పరిస్థితి. వాడిని మీరు ఘనముగా సత్కరించటం విలువైన కానుకలు ఇచ్చి వాడిని తృప్తి పరచుటయే గాని మీకు మేలు కలుగు మార్గము, మేలు కలుగు మాటలు వాడు చెప్పడు అటువంటి వాళ్ళే మీకు కావాలి. నీతిని బోధించే వాళ్ళు మీకు అవసరం లేదు. క్యాసెట్ల వ్యాపారం, సభ్యత్వములతో వ్యాపారం, పండుగలలో వ్యాపారం అంతా అక్రమమే గాని నీతివర్తన లేదు, వాక్యక్రమము లేదు. ఇక్కడ విశ్వాసులలో ఎంతో వ్యభిచారము జరుగుచున్నది. ఎంతో అక్రమము జరుగుచున్నది. అక్రమ సంబంధాలకు ఇది నిలయమైనది. వేశ్యల వెంబడి వ్యభిచారుల వెంబడి తిరుగుచున్నారు యిర్మీయా 5:7. మీరు ఇక్కడ నీతిగా ఉండుటలేదు. గనుక అక్కడ మీ వాళ్ళు తిరగలి విసరుచుంటారు అని వాక్యము వ్రాయబడి ఉంది. "నేను హృదయమున పరస్త్రీని మోహించిన యెడల నా పొరుగువాని ద్వారమున

నేను పొంచియున్న యెడల నా భార్య వేరొకనికి తిరుగలి విసరును గాక! ఇతరులు ఆమెను కూడుదురు గాక!" యోబు 31:9,10. గనుక గ్రహించండి మీరు ఇతరులకు ఏమి చేయుచున్నారో అదే మీకు చేయబడును. అందువలన తిరగండి పరమతండ్రికి నమ్మకస్తులై యుండండి. నీచమైన పాలేరు స్థితిలో ఉన్నా మన పూర్వీకులు ఎంతో దుర్భరమైన జీవితమును ఎదుర్కొన్నారు. మనమైతే పరమతండ్రిని ఆశ్రయించటం వలన మంచి ఆహారము, మంచి దుస్తులు, మంచి గృహము, మంచి గౌరవము మనకు ఇచ్చియున్నాడు. దీనిని మనం నిలబెట్టుకోవలెను గాని పూర్వస్థితిలోనికి దిగజారకూడదు. ఇక్కడ జరిగే ప్రతీ అక్రమమును సరిచేసుకొనవలెను, ఎన్నో వాక్య వ్యతిరేక బోధలు ఇక్కడ ఉన్నవి వాటిని మనం సరిచేసుకోవాలి గాని మన సహోదరులను మనం మోసం చేయకూడదు (1థెస్స 4:4-6). గనుక గ్రహించండి మీ కుటుంబాలు నిర్లక్ష్యం చేసి ఇక్కడ వేరే కుటుంబాన్ని మెయిన్‌టేన్ చేయ్యకండి. వాక్యముపై లక్ష్యం ఉంచి వాక్య వ్యతిరేకమైన దానిని సరిచేయండి. పరమతండ్రి యొక్క నిజమైన నామమే ఈ క్రైస్తవ సమాజాలకు తెలియదు. ఆయన నిజమైన నామము యావె అని, ఆయనే రక్షకుడై యషువ మెస్సియగా వచ్చునని చెప్పిన అర్థం చేసుకొనడంలేదు. వీటిపై మనం లక్ష్యముంచవలెను గాని అక్రమ శరీర సంబంధాలపైన, మత్తు పానీయములపైన, లాభకరమైన మోసములపైన కాదు. అందువలన "మోసపోకుడి ఎలోహిం వెక్కిరింపబడడు, మనుష్యులు ఏమి విత్తునో ఆ పంటనే కోయును." గలతీ 6:7.గనుక ఇదే అన్నిటికీ సౌకర్యముగా ఉన్నదీ, ఇదే పరలోకమని పరమ ఆనంద పడేవారు ఇక్కడ అనేకమంది ఉన్నారు. కాని ఇది ఘోరమైన అగ్నిగుండము, సొదొమాగొమోఱ్ఱా వంటిదై యున్నది. గనుక ఇక్కడ ఉన్న క్రైస్తవ బోధకులారా ముందు మీ అక్రమములను సరిచేసుకొని విశ్వాసులను క్రమపరచండి. పరమతండ్రికి యిష్టులై ఉండండి. ఇక్కడ మనకు గల్ఫ్ ద్వారాన్ని పరమతండ్రి మూసివేస్తే మనకు తోడు ఎవరు? నీడ ఎవరు? మన స్థితి ఎలా ఉంటుందో మీకు తెలుసు. అక్కడ మనవాళ్ళ పరిస్థితి ఎలా ఉంటుందో అదికూడా మీకు తెలుసు. రాజులకు పాలేరులుగా ఉండాలి. చద్దిమూట కర్రకు కట్టుకొని రాజుగారి గేదెల కూడా పోవాలి. ఇక్కడ గల్ఫ్ సొమ్మును చూసి మన పిల్లలు ఇంటిదగ్గర క్రమశిక్షణ లేక త్రాగి గంతులు వేస్తూ అల్లరి చిల్లరిగా తిరుగుచున్నారు. అక్కడ మనవాళ్ళు తల్లి, పిల్లలూ అందరూ నీతిగా, నమ్మకముగా ఉండాలి అంటే ముందు ఇక్కడ మనం నీతిగా, నమ్మకముగా ఉండి పరమతండ్రిలో ఎదగాలి. అప్పుడే మనం అన్ని విషయములలో, అన్ని రంగములుగా పరమతండ్రిలో నిజమైన బిడ్డలుగా ఫలిస్తాం. గనుగ దిద్దుబాటును అస్యహించుకొనక అనేకమందిని మంచిమార్గములో నడిపించండి. మనం ఆశీర్వాదానికి పిలువబడ్డాం గాని, శిక్షకు కాదు. అందువలన ఆశీర్వదింపబడేవాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుందో మీకు తెలుసు, అన్నీ మీకు తెలుసు. గనుక మేలైన మార్గము కీడైన మార్గము రెండూ మీ యెదుటనే ఉన్నవి. ఏ మార్గము కావలెనో మీరే నిర్ణయించుకొనండి. పరాయి దేశములో ఉన్న షద్రక్, మేషాక్, అబెద్నిగోలు ఎలా పరమతండ్రి కొరకై నిలచి ఆయనకు ఘనత తెచ్చినారో గుర్తుచేసుకొనండి. అటువంటి ఆత్మను పొందుకొని, పరమతండ్రి యొక్క నీతిని చాటండి. ఏ స్థితిలో ఉన్నా, ఏ దేశములో ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా మనం నిజమైన పరమతండ్రి బిడ్డలమని నిరూపించండి. మీరు ఇంకా ఆత్మీయమైన సత్యములో ఎదుగుదల కొరకు, లోతైన మర్మములను తెలుసుకొనుటకు వీళ్ళకు వ్రాయండి. వీళ్ళు మీకు సత్యమైన విషయములు తెలియపరచుదురు. పరమతండ్రి మీకు నీతియుక్తమైన జీవితమును అందించునుగాక.


**వివరములకు వ్రాయండి సంప్రదించండి :**

**A.O.T.L.E**

**మలికిపురం - 533 253, తూ.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా**

ఫోన్ : 08862-227613, సెల్ : 9908831613